# జుడా ఏర్పాటుకు అడుగులు

## జిల్లా కేంద్రం సహా 53 గ్రామాలతో ప్రతిపాదన



జగిత్యాల పట్టణం

న్యూస్‌టుడే, జగిత్యాల

జగిత్యాల అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ(జుడా) ఏర్పాటుకు అడుగులు పడుతున్నాయి. జుడా ఏర్పాటు చేయాలని ఆరేళ్ల కిందట ప్రతిపాదనలు సిద్ధం చేసినప్పటికీ కార్యరూపం దాల్చలేదు. ప్రస్తుతం అన్ని జిల్లాల్లో అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీలు ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయించిన నేపథ్యంలో జిల్లాలోనూ ఏర్పాటుకు రంగం సిద్ధమవుతోంది. మొదట 53 గ్రామాలతో జగిత్యాల, 17 గ్రామాలతో కోరుట్ల, 22 గ్రామాలతో మెట్‌పల్లి అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీలు ఏర్పాటుకు ప్రతిపాదనలు సిద్ధం చేశారు. మరోసారి జగిత్యాలలో ఒకటి, కోరుట్ల, మెట్‌పల్లి పట్టణాలు 44 గ్రామాలు కలిపి మరో అథారిటీ ఏర్పాటు చేయాలని భావించారు. మరోసారి జిల్లాలోని అన్ని పట్టణాలు, 382 గ్రామ పంచాయతీలను కలిపి ఒకే అథారిటీగా ఏర్పాటు చేయాలని ఆలోచించారు. చివరికి కేవలం జిల్లా కేంద్రంతోపాటు చుట్టు పక్కల 15 కి.మీ పరిధిలోని గ్రామాలను కలిపి అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ ఏర్పాటు చేయాలని ప్రభుత్వం సూచించిన మేరకు జగిత్యాల పట్టణం చుట్టుపక్కల 53 గ్రామాలను కలుపుతూ జుడాను ప్రతిపాదించారు.

### ప్రయోజనం

అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీతో ప్రత్యేక వ్యవస్థ ఏర్పాటు కానుంది. సంస్థకు ఛైర్మన్‌ను ప్రభుత్వం నియమిస్తుంది. వైస్ ఛైర్మన్‌గా జిల్లా కలెక్టర్ వ్యవహరిస్తారు. గ్రామపంచాయతీలకు ఎలాంటి ఇబ్బంది ఉండదు. జుడా పరిధిలోని పట్టణం, గ్రామాల్లో ప్రత్యేకంగా అభివృద్ధి పనులు చేపట్టే వీలుంటుంది. రహదారులు, మురుగుకాలువల నిర్మాణం, వీధిదీపాల ఏర్పాటు తదితర అభివృద్ధికి నిధులు వస్తాయి. అంతేగాకుండా ప్రణాళిక విభాగాన్ని ఏర్పాటు చేస్తారు. బహుళ అంతస్థుల నిర్మాణాలు పరిశ్రమల ఏర్పాటు తదితర అనుమతులన్నీ జుడా ఇస్తుంది.

### అభివృద్ధికి అవకాశం



రాష్ట్ర ప్రభుత్వ సూచన మేరకు జగిత్యాల అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ(జుడా) ఏర్పాటుకు ప్రతిపాదనలు పంపాం. జిల్లా కేంద్రం సహా చుట్టు పక్కల మండలాల్లోని 53 గ్రామాలను జుడాలో చేర్చాం. జుడా ఏర్పాటుతో గ్రామ పంచాయతీలకు ఎలాంటి ఇబ్బంది ఉండదు. అథారిటీ పరిధిలోని పట్టణం, గ్రామాలు సమగ్రంగా అభివృద్ధి చెందే అవకాశం లభిస్తుంది. **- బి.సత్యప్రసాద్, కలెక్టర్**

**జుడాలో జిల్లా కేంద్రంతోపాటు చుట్టుపక్కల ఏడు మండలాల్లోని 53 గ్రామాలను ప్రతిపాదించారు.**

■ **జగిత్యాల పట్టణం, అర్బన్ మండలం:** హస్నాబాద్, అంబారిపేట, మోతె, తిప్పన్నపేట, ధరూర్ గ్రామాలు.

■ **జగిత్యాల రూరల్ మండలం:** పొలాస, హైదర్‌పల్లి, కండ్లపల్లి, చెర్లపల్లి, హన్మాజిపేట, పోరండ్ల, బాలపల్లి, నర్సింగాపూర్, వంజరిపల్లి, వెల్దుర్తి, గొల్లపల్లి, తిమ్మాపూర్, జాబితాపూర్, ధర్మారం, లక్ష్మీపూర్, అనంతారం, చల్‌గల్, తాటిపల్లి, అంతర్గాం, గుట్టరాజ్‌పల్లి, కన్నాపూర్, తక్కళ్లపల్లి, గుల్లపేట, మోరపల్లి గ్రామాలు.

■ **సారంగాపూర్ మండలం:** పెంబట్ల, కోనాపూర్, లచ్చక్కపేట, నాగునూరు, రంగపేట, లక్ష్మిదేవిపల్లి, అర్పపల్లి.

■ **మేడిపల్లి మండలం:** కాచారం, విలాయతాబాద్, మేడిపల్లి, గుండ్లపల్లి, రంగాపూర్, కట్లకుంట, తొంబరావుపేట గ్రామాలు.

■ **మల్యాల మండలం:** రాజారం, పోతారం, రామన్నపేట, నూకపల్లి.

■ **గొల్లపల్లి మండలం:** బిబిరాజ్‌పల్లి, వెంగళాపూర్, ఇబ్రహీంనగర్, తిర్మలాపూర్.

■ **రాయికల్ మండలం:** అల్లీపూర్, కిష్టంపేట గ్రామాలను జుడాలో ప్రతిపాదించారు.

### బీటులో దినుసుల కొనుగోలు

**జగిత్యాల వాణిజ్యం:** జగిత్యాల వ్యవసాయ మార్కెట్ యార్డులో సోమవారం 828 క్వింటాళ్ల మక్కలను రైతులు విక్రయించగా క్వింటాలుకు కనిష్ఠంగా రూ.1,600 నుంచి గరిష్ఠంగా రూ.2,511 వరకు ధర పలికినట్లు మార్కెట్ కార్యదర్శి టి.రాజశేఖర్ తెలిపారు. ఎంటీయూ1010 రకం ధాన్యం రూ.1,700, బీపీటీ రూ.1,907 చొప్పున ధరలు పలికినట్లు వివరించారు.

# సీసీఏ కేంద్రానికి మోక్షం కలిగేనా!



పొరుగు జిల్లాలోని కేంద్రానికి పత్తి తరలిస్తున్న రైతులు (పాతచిత్రం)

న్యూస్‌టుడే, ధర్మపురి

ధర్మపురి నియోజకవర్గంలో సీసీఏ(పత్తి కొనుగోలు కేంద్రం) ఏర్పాటు ప్రతిపాదనలోనే మిగిలిపోయింది. దీంతో ఏటా రైతులు తమ పత్తిని తక్కువ ధరకే దళారులకు విక్రయిస్తూ మోసపోతున్నారు. మరికొందరు వ్యయ ప్రయాసలకు ఓర్చి, పొరుగు జిల్లాలోని సీసీఏ కేంద్రానికి తరలిస్తున్నారు.

**మూడేళ్ల కిందట ప్రతిపాదించినా..**

ధర్మపురి నియోజవర్గంలోని ఆరు మండలాల్లో సుమారుగా 5 వేల ఎకరాల వరకు పత్తి సాగు చేస్తున్నారు. ఎకరానికి 12 నుంచి 15 క్వింటాళ్ల వరకు గతేడాది దిగుబడి వచ్చింది. ఇప్పటివరకు ఎకరానికి ఒక్కో రైతు రూ.30 వేల వరకు పెట్టుబడులు పెట్టగా.. ఇటీవల అకాల వర్షాలతో దిగుబడి తగ్గే అవకాశముందని రైతులు వాపోతున్నారు. మండలంలోని ధర్మపురి, నక్కలపేట, దోనూర్, తీగలధర్మారం, గాదెపల్లి, దమ్మన్నపేట, రాజారం, దొంతాపూర్, రాయపట్నం తదితర గ్రామాల్లో ఎక్కువగా పత్తి పంట సాగు చేస్తున్నారు. ధర్మపురిలో సీసీఏ కేంద్రాన్ని ఏర్పాటు చేసేందుకు గత మూడేళ్ల కిందట ప్రతిపాదించినా మోక్షం కలుగలేదు. దీంతో పక్కనున్న మంచిర్యాల జిల్లా లక్షెట్టిపేట మండలంలోని కన్నెపెల్లి సీసీఏ కేంద్రానికి తమ పత్తిని తీసుకెళ్తున్నారు. మరో నెలరోజుల్లో పంట చేతికి అందే అవకాశమున్నందున.. సీసీఏ కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని రైతులు ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

రైతేరాజు 9లో

# ప్రజావాణి వినతులకు సత్వర పరిష్కారం



సమస్యలు వింటున్న అదనపు కలెక్టర్ రాంబాబు

**జగిత్యాల, న్యూస్‌టుడే:** ప్రజావాణిలో వచ్చే వినతులను సత్వరమే పరిష్కరించాలని జిల్లా అదనపు కలెక్టర్ జి.రాంబాబు ఆదేశించారు. సోమవారం సమీకృత జిల్లా కార్యాలయ సముదాయంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ బి.గౌతంరెడ్డితో కలిసి ప్రజావాణిలో సమస్యలు విన్నారు. ఫిర్యాదులపై సానుకూలంగా వ్యవహరించి పెండింగ్‌లో ఉంచకుండా వెంటనే పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సందర్భంగా 25 వినతులు రాగా పరిశీలించి చర్యలు తీసుకోవాల్సిందిగా సంబంధింత శాఖలకు రాశారు. జగిత్యాల, కోరుట్ల ఆర్డీవోలు పి.మధుసూదన్, ఎన్.శ్రీనివాస్, కలెక్టరేట్ ఏవో పి.హన్మంతరావు, డీపీవో ఎం.రఘువరన్ తదితరులు పాల్గొన్నారు.

### శ్మశాన వాటికకు భూమి కేటాయించండి




జగిత్యాల గ్రామీణ మండలం తాటిపల్లి గ్రామంలో మాల సంఘం శ్మశాన వాటికకు భూమి కేటాయించాలని సంఘ సభ్యులు విజ్ఞప్తి చేశారు. నల్లగుట్ట శివారు సర్వే 176లో గత 60 సంవత్సరాలుగా స్మశానవాటిక ఉందని అందులో 5 ఎకరాలు తమకు కేటాయించి అవసరమైన సదుపాయాలు కల్పించాలని వారు కోరారు.

### కార్మికుల వేతనాలు చెల్లించాలని..

గ్రామపంచాయతీ కార్మికుల పెండింగ్ వేతనాలు చెల్లించాలని గ్రామ పంచాయతీ ఎంప్లాయిస్ వర్కర్స్ యూనియన్ కోరింది. ఈ మేరకు సోమవారం సీఐటీయూ ఆధ్వర్యంలో కలెక్టరేట్ కార్యాలయానికి వచ్చారు. గ్రామాల్లో అన్ని పనులు చేస్తున్న తమకు నెలల తరబడి వేతనాలు ఇవ్వకపోవడంతో ఇబ్బందులు పడుతున్నామని దసరా పండగ నేపథ్యంలో వెంటనే వేతనాలు చెల్లించాలన్నారు.




## స్కందమాతగా అమ్మవారు



దుర్గా నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా అయిదో రోజు సోమవారం సామూహిక కుంకుమార్చనలు, బోనాలు నిర్వహించారు. కనకదుర్గా సేవాసమితి ఆధ్వర్యంలో ఉదయం అమ్మవారు స్కందమాత రూపంలో దర్శనమిచ్చారు. నవదుర్గా క్షేత్రపీఠం, భక్తమార్కండేయ ఆలయంలో సాయంత్రం బోనాలు, చండీ హవనం నిర్వహించారు. స్వర్ణకార సంఘం ఆధ్వర్యంలో సామూహిక కుంకుమార్చన, విద్యానగర్ జయదుర్గా సేవామితి ఆధ్వర్యంలో అమ్మవారిని గాజులతో అలంకరించారు. ఎస్‌కెఎన్‌ఆర్ డిగ్రీ కళాశాల నల్లపోచమ్మ ఆలయంలో అమ్మవారిని కరెన్సీ నోట్లతో అమ్మవారు దర్శనమిచ్చారు.

– న్యూస్‌టుడే, జగిత్యాల విద్యానగర్

## శేష వాహనంపై శ్రీవారు



కోరుట్ల పట్టణంలోని శ్రీవేంకటేశ్వరస్వామి దేవాలయంలో శరన్నవరాత్రోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. సోమవారం శేష వాహనంపై శ్రీవారు భక్తులకు దర్శనమిచ్చారు. అనంతరం స్వామివారిని రథంలో నెలకొల్పి పట్టణంలోని పురవీధుల్లో శోభయాత్ర చేపట్టారు.

– న్యూస్‌టుడే, కోరుట్ల

### కమిషనర్ తీరుపై అధికారుల అసహనం

**జగిత్యాల, న్యూస్‌టుడే:** కలెక్టరేట్‌లో సోమవారం జరిగిన ప్రజావాణిలో జగిత్యాల పురపాలక కమిషనర్ సమ్మయ్య తీరుపై అదనపు కలెక్టర్లు అసహనం వ్యక్తం చేశారు. వార్డు అధికారుల విషయమై ప్రశ్నించగా తనకు తెలియకుండా నియమించారని కమిషనర్ సమాధానమిచ్చారు. జిల్లా కలెక్టర్ నియమించారు మీకు కూడా సమాచారం ఉందని అదనపు కలెక్టర్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా కమిషనర్ అధికారుల మధ్య చిన్నపాటి వాగ్వాదం చోటుచేసుకుంది.



## అసలే మూలమలుపు..
## ఆపై మట్టి కుప్పలు

చాలా ఏళ్ల క్రితం నిర్మించిన జగదేవుపేట-చెర్లపల్లి దారి శిథిలావస్థకు చేరుకుంది. దీనికితోడు ఇటీవల రోడ్డుకు ఇరువైపులా మట్టి కుప్పలు పోసి అలాగే వదిలేశారు. దీంతో ఓ పెద్ద వాహనం వస్తే ద్విచక్ర వాహనం వెళ్లలేని పరిస్థితి నెలకొంది. మరోవైపు వెల్గటూరు-జగదేవుపేట మార్గమధ్యలో.. పెద్దవాగు వంతెన సమీప రహదారి పూర్తిగా మట్టి రోడ్డును తలపిస్తూ అడుగడుగునా ప్రమాదకర కందకాలు ఉన్నాయి. మెరుగైన రహదారి కల్పించాలని స్థానికులు కోరుతున్నారు.

**- న్యూస్‌టుడే, వెల్గటూర్**

## వంతెనపై ప్రయాణం వణుకు పుట్టిస్తోంది



స్థానిక బురుగుపల్లె వద్ద లోలెవల్ వంతెన శిథిలావస్థకు చేరింది. ప్రమాదాలు జరగకుండా పైపులతో ఏర్పాటుచేసిన రక్షణ గోడలు ధ్వంసమయ్యాయి. బోలి చెరువు నుంచి భారీ వరద వచ్చినప్పుడు. . ఈ వంతెన నీటిలో మునిగిపోయి, రాకపోకలకు అంతరాయం ఏర్పడుతోంది. వంతెనకు ఇరువైపులా రక్షణగా పైపులను ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు. **- న్యూస్‌టుడే, ధర్మపురి**

# చరవాణి పోతే ఆందోళన వద్దు





సెల్‌ఫోన్లు పొందిన వారితో ఎస్పీ

**జగిత్యాల, న్యూస్‌టుడే:** సెల్‌ఫోన్లు చోరీకి గురైనా పోగొట్టుకున్నా ఆందోళన చెందవద్దని ఎస్పీ అశోక్‌కుమార్ అన్నారు. జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం సెల్‌ఫోన్ పోగొట్టుకున్న 104 మంది బాధితులకు అందించారు. రికవరీ అయిన సెల్‌ఫోన్ల విలువ రూ.20 లక్షలు ఉంటుందని వెబ్‌సైట్‌లో వినియోగదారులు వివరాలు నమోదు చేసుకుంటే ఈ-పోర్టల్ ద్వారా సెల్‌ఫోన్లను సులభంగా గుర్తించి స్వాధీన పర్చుకోవచ్చన్నారు. జిల్లాలో సెల్‌ఫోన్ల రికవరీ కోసం ఒక ఇన్‌స్పెక్టర్ ఆధ్వర్యంలో ఆర్ఎస్సై, హెడ్ కానిస్టేబుల్, ఇద్దరు కానిస్టేబుళ్లతో ప్రత్యేక బృందం ఏర్పాటు చేశామని ఇప్పటి వరకు 601 ఫోన్లను రికవరీ చేసి బాధితులకు ఇచ్చామన్నారు. ఈ సందర్భంగా ఫోన్ల రికవరీలో ప్రతిభ చూపిన ఐటీకోర్ ఇన్‌స్పెక్టర్ రఫిక్‌ఖాన్, ఆర్ఎస్సై క్రిష్ణ, హెడ్‌కానిస్టేబుల్ మహమూద్, కానిస్టేబుళ్లు, అజర్, యకూబ్, మల్లేశంలను ఎస్పీ అభినందించి ప్రశంసాపత్రాలు అందించారు.

### బాధితులకు సత్వర న్యాయం జరగాలి

**జగిత్యాల, న్యూస్‌టుడే:** పోలీసుస్టేషన్లకు వచ్చే బాధితులకు సత్వర న్యాయం జరగాలని ఎస్పీ అశోక్‌కుమార్ అన్నారు. గ్రీవెన్స్‌డే సందర్భంగా సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల సమస్యలు విన్నారు. సంబంధిత పోలీసు అధికారులతో మాట్లాడి ఫిర్యాదుదారులకు న్యాయం చేయాలని ఆదేశించారు. ప్రజలకు పోలీసుశాఖను మరింత చేరువ చేయడమే తమ లక్ష్యమని పోలీసుస్టేషన్‌కు వచ్చే ఫిర్యాదుదారులతో మర్యాదగా మాట్లాడి వినతులు స్వీకరించాలని ఫిర్యాదులపై క్షేత్రస్థాయిలో పరిశీలించి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

# కొత్త గురువులు వస్తున్నారు



## డీఎస్సీలో ఎంపికైన వారికి రేపు నియామక పత్రాలు

న్యూస్‌టుడే-కరీంనగర్ విద్యావిభాగం



కరీంనగర్‌లో డీఎస్సీలో ఎంపికైన అభ్యర్థుల ధ్రువీకరణ పత్రాల పరిశీలన

ఉమ్మడి జిల్లాలో కొంతమేర బోధన ఇబ్బందులు తొలగనున్నాయి. 2024 డీఎస్సీ ద్వారా ఉపాధ్యాయ ఉద్యోగాల భర్తీ ప్రక్రియ తుది దశకు చేరుకుంది. డీఎస్సీలో మెరిట్ సాధించిన అభ్యర్థులను 1:3 పద్ధతిలో ధ్రువీకరణ పత్రాల పరిశీలనకు పిలిచి ఈ కార్యక్రమాన్ని జిల్లా విద్యాశాఖలు పూర్తి చేశాయి. ఉద్యోగాలకు ఎంపికైన అభ్యర్థులకు బుధవారం హైదరాబాద్‌లో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నియామక పత్రాలను అందించనున్నారు. మరో వైపు వారి నియామకాలకు సంబంధించిన ఖాళీల వివరాలను సేకరించి వాటిని ప్రకటించేందుకు జిల్లా విద్యాశాఖ అధికారులు సిద్ధమయ్యారు.

**ప్రాథమిక పాఠశాలలకు ఊరట..**

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ప్రాథమిక పాఠశాలల్లో ఉపాధ్యాయుల సమస్య వేధిస్తోంది. ఇటీవల పదోన్నతులు, బదిలీలను ప్రభుత్వం చేపట్టిన అనంతరం ఎస్జీటీల కొరత తీవ్రంగా ఉంది. చాలామందికి పదోన్నతులు రావడం ఇందుకు కారణం. బదిలీ పొందిన పలువురు ఉపాధ్యాయులు రిలీవర్ లేని కారణంగా అదే పాఠశాలల్లో పని చేస్తున్నారు. డీఎస్సీ ప్రకటన వెలువడిన అనంతరం ఎస్జీటీలకు పదోన్నతులు కల్పించడం, బదిలీ చేయడంతో పెద్ద సంఖ్యలో ఖాళీలు ఏర్పడ్డాయి. ఉన్నత, ప్రాథమికోన్నత పాఠశాలల్లో ఉపాధ్యాయుల కొరత కొంతమేరకు ఉంటుంది. ప్రస్తుతం డీఎస్సీ ద్వారా ఉపాధ్యాయుల నియామకాలు జరుగుతుండటంతో ఈ సమస్య తీరనుంది. ముఖ్యంగా ప్రాథమిక పాఠశాలల్లో ఎస్జీటీల కొరతకు కొంత ఊరట లభించనుంది. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా వారి నియామకాలు జరిగినా ఇంకా ఎస్జీటీల కొరత పలు పాఠశాలలను వేధించనుంది. జగిత్యాల జిల్లాలో 441, కరీంనగర్‌లో 311, పెద్దపల్లిలో 158, రాజన్న సిరిసిల్లలో 231 ఎస్జీటీ పోస్టులు ఖాళీగా ఉన్నాయి.

**జిల్లాల వారీగా నియామక పోస్టుల వివరాలు..**

| విభాగం | జగిత్యాల | కరీంనగర్ | పెద్దపల్లి | రాజన్న సిరిసిల్ల |
|---|---|---|---|---|
| స్కూల్ అసిస్టెంట్ | 99 | 86 | 49 | 56 |
| భాషా పండితులు | 39 | 18 | 5 | 12 |
| పీఈటీలు | 8 | 7 | 1 | 4 |
| ఎస్జీటీలు | 161 | 114 | 21 | 67 |
| స్పెషల్ ఎడ్యుకేటర్(ఎస్ఏ) | 5 | 5 | 5 | 3 |
| ఎస్జీటీ | 22 | 15 | 12 | 9 |
| మొత్తం | 334 | 245 | 93 | 151 |

### మార్కెట్‌కు దసరా సెలవులు

**జగిత్యాల వాణిజ్యం:** దసరా, బతుకమ్మ పండగల సందర్భంగా జగిత్యాల వ్యవసాయ మార్కెట్‌యార్డుకు ఈ నెల 10 నుంచి 13 వరకు సెలవులు ప్రకటించినట్లు మార్కెట్ కార్యదర్శి టి.రాజశేఖర్ తెలిపారు. ఈ నెల 14 నుంచి యార్డులో దినుసుల క్రయవిక్రయాలు ఉంటాయని, రైతులు గమనించాలని కోరారు.



# పెరిగిన వ్యయం.. సేకరణ భారం

న్యూస్‌టుడే, సారంగాపూర్

ప్రతి సీజన్‌లో కొనుగోలు కేంద్రాలలో నిర్వహణ వ్యయం పెరుగుతూ రావడం.. అందుకు అనుగుణంగా కమీషన్ పెంచకపోవడం.. సకాలంలో చెల్లింపులు చేయకపోవడంతో మహిళా సంఘాలకు ధాన్యం సేకరణ భారంగా మారింది. గత రెండు సీజన్లలో జిల్లాలో సెర్ప్ ఆధ్వర్యంలో 133 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి ధాన్యాన్ని సేకరించారు. ఏటా సేకరణలో రాష్ట్రంలోనే జిల్లా ఆదర్శంగా నిలుస్తుండగా గత రెండు పంటల కమీషన్ రాకపోవడం, గతంలో అందించిన కమీషన్‌లో కోత విధించారు. ప్రస్తుతం జిల్లాలో వరికోతలు ప్రారంభం కావస్తుండడంతో అధికారులు 427 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయనున్నారు. ఇందులో సెర్ప్ ద్వారా 175, సహకార సంఘాల ద్వారా 251, మెప్మా ద్వారా ఒక కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేసి సేకరణ చేపట్టేందుకు చర్యలు చేపట్టారు. అయితే 2023-24 వానాకాలంలో 90,41,971 క్వింటాళ్ల ధాన్యాన్ని, యాసంగిలో 12,23,330 క్వింటాళ్ల ధాన్యాన్ని సేకరించగా కమీషన్ రాకపోవడంతో ఇబ్బందిగా మారింది. దాదాపు రూ.32.84 కోట్ల కమీషన్ మహిళా సంఘాలకు చెల్లించాల్సి ఉంది.

### రెండు సీజన్లుగా అందని కమీషన్

అంతేకాకుండా గతంలో ఒక సీజన్‌లో సేకరించిన ధాన్యం కమీషన్‌లో కేవలం 70 శాతం చెల్లింపులు చేపట్టి మిగతా 30 శాతం కోత విధించారు.

■ కొనుగోలు కేంద్రాల ద్వారా సేకరించే ధాన్యానికి మహిళా సంఘాలకు క్వింటాలుకు పదేళ్లుగా రూ.32 చొప్పున కమీషన్ చెల్లిస్తున్నారు. అందులో కేవలం రూ.13 మాత్రమే వ్యయం చేయాల్సి ఉంటుండగా ఇందులో కేంద్రాలలో పని చేసే మహిళలు, కూలీలకు కూడా సరిపోవడం లేదు. ఇందులో 5 వేల క్వింటాళ్ల ధాన్యాన్ని సేకరిస్తే రూ.లక్ష నుంచి రూ.1.20 లక్షల వరకు వ్యయం చేస్తుంటే కేవలం రూ.60 వేలు మాత్రమే చెల్లించేందుకు అనుమతి ఉంది. ఇందులో మహిళల రోజువారీ కూలీ కనీసం రూ.33 వేలు, ట్యాబ్, రికార్డుల అపరేటర్ల వేతనాల కోసం రూ.25వేలు, వాచ్‌మెన్ కోసం రూ.8వేలు, అంతేకాకుండా సుతిలీ, ఇతరత్రా రూ.15 నుంచి రూ.20 వేల వరకు అదనంగా ఉంటున్నాయి.



కొనుగోలు కేంద్రంలో పరిశీలిస్తున్న సెర్ప్ అధికారులు (పాతచిత్రం)

**బలవంతంగా అప్పగింత..**

గతంలో ధాన్యం సేకరణకు మహిళా సంఘాలు గ్రామాల్లో పోటీ పడతుండేవి. కేంద్రాల అప్పగింత అప్పట్లో సెర్ప్ అధికారులకు తలనొప్పిగా మారేది. ప్రస్తుతం సకాలంలో కమీషన్ రాకపోవడం, వచ్చిన దాంట్లో కోత విధించడంతో మహిళా సంఘాలు ఆసక్తి చూపడంలేదు. బలవంతంగా కేంద్రాలను అప్పగించాల్సి వస్తోంది. ధాన్యంలో మిల్లర్లు కోత విధించడం, రైతులతో ఒత్తిడి రావడం సమస్యగా మారుతోంది. మిల్లర్ల నుంచి వచ్చిన పాత గన్నీ సంచులకు రంధ్రాలు ఉండడంతో పక్కన పడేయాల్సి వస్తోంది. చాలా సమస్యలు ఉండడంతో కేంద్రాలను సహకార సంఘాలకు అప్పగిస్తూ వస్తున్నారు.

**సెర్ప్ ద్వారా సేకరించిన ధాన్యం, కమీషన్ వివరాలు**

| పంట కాలం | సంఘాలు | సేకరణ (క్విం. లలో) | కమీషన్ (రూ.) |
|---|---|---|---|
| వానాకాలం 2016-17 | 118 | 8,59,133 | 2,74,89,967 |
| యాసంగి 2016-17 | 144 | 18,86,651 | 6,26,95,025 |
| వానాకాలం 2017-18 | 132 | 8,77,642 | 2,22,29,897 |
| యాసంగి-2017-18 | 146 | 15,49,981 | 4,51,64,622 |
| వానాకాలం-2018-19 | 153 | 16,08,926 | 4,95,39,203 |
| యాసంగి-2018-19 | 163 | 15,70,490 | 4,77,16,616 |
| వానాకాలం 2019-20 | 172 | 19,26,407 | 6,16,36,123 |
| యాసంగి- 2019-20 | 172 | 19,06,284 | 6,09,97,078 |
| వానాకాలం 2020-21 | 160 | 9,98,481 | 3,19,51,392 |
| యాసంగి 2020-21 | 160 | 19,82,680 | 6,34,45,760 |
| వర్షాకాలం 2021-22 | 146 | 13,32,090 | 4,26,26,880 |
| యాసంగి 2021-22 | 122 | 8,58,911 | 2,74,85,152 |
| వానాకాలం 2022-23 | 144 | 11,61,872 | 3,71,79,904 |
| యాసంగి 2022-23 | 144 | 12,56,922 | 4,02,21,504 |
| వానాకాలం 2023-24 | 133 | 90,41,971 | 28,93,072 |
| యాసంగి 2023-24 | 133 | 12,23,330 | 3,91,46,560 |

**మేమున్నాం.. మీకు తోడుగా..** (10 AM TO 1 PM)
జగిత్యాల 94400 23123
కోరుట్ల 9491324656 ధర్మపురి 94403 88638

**న్యూస్‌టుడే, మెట్‌పల్లి పట్టణం**

? పట్టణంలోని పలు చోట్ల మురుగుకాల్వలపై స్లాబులు కూలి ఇనుప చువ్వలు తేలి ప్రమాదకరంగా మారాయి. - **నాగరాజు**
✓ నిధులు మంజూరయ్యాయి. ప్రస్తుతం కొన్నింటిని గుర్తించాం. త్వరలో పనులను ప్రారంభించి స్లాబులు నిర్మిస్తాం. - **మోహన్, పుర కమిషనర్**

**న్యూస్‌టుడే, జగిత్యాల ధరూర్‌క్యాంపు**

? జగిత్యాల శివారు కాలనీలో వీధిలైట్లు లేనందున బతుకమ్మలు ఆడే వారికి ఇబ్బందులు తలెత్తుతున్నాయి. - **మల్లేశ్, కొత్తవాడ**
✓ పండగల నిమిత్తం పట్టణంలోని అన్ని ప్రాంతాల్లో లైట్ల మరమ్మతు, నూతన లైట్ల బిగింపు చేపడుతున్నాము. - **సమ్మయ్య, పురపాలక కమిషనర్, జగిత్యాల**

**న్యూస్‌టుడే, ధర్మపురి**

? ధర్మపురి గాంధీ విగ్రహ కూడలి వద్దనున్న బోరువెల్‌కు బోల్టులు ఊడి పోయి, ప్రమాదకరంగా మారింది. మరమ్మతులు చేయించాలి. - **ప్రయాణికులు, ధర్మపురి**
✓ క్షేత్రస్థాయిలో పరిశీలించి మరమ్మతులు జరిపిస్తాం. - **బాలె గంగాధర్, పుర కమిషనర్, ధర్మపురి**

# అన్నదానాలు.. కుంకుమార్చనలు


మల్యాలలో దుర్గాదేవికి వివిధ రకాల ఆకులు, పూలతో అలంకరణ


కోరుట్లలో బోనాలతో ఊరేగింపు


మెట్‌పల్లి పట్టణం: త్రిశక్తి ఆలయంలో..


మెట్‌పల్లిలో సామూహిక కుంకుమార్చన


జగిత్యాలలో..


రాయికల్ పట్టణం: శ్రీస్కందమాత అవతారంలో..

దుర్గాదేవి శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా అమ్మవారికి సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. సామూహిక కుంకుమార్చన, అన్నదానాలు, బోనాలు సమర్పించారు. - న్యూస్‌టుడే యంత్రాంగం


వెల్గటూరులో..


రాయికల్: ఆలూరులో ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి


కొడిమ్యాల: చండీహోమం


రాజారాంపల్లిలో యువకులతో విప్ లక్ష్మణ్‌కుమార్


రాయికల్‌లో బోనాలతో మహిళలు

## సూచిక బోర్డు ఇలా..



మండలకేంద్రంలో ఇందిరా గాంధీ చౌరస్తా వద్ద ఆర్ అండ్ బీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సూచిక బోర్డు ఓ వైపునకు వంగి పోయి ఉంది. బోర్డు చుట్టూ పిచ్చి మొక్కలు పెరగడంతో వాహనదారులకు బోర్డు కనిపించడం లేదు. బోర్డులో మెట్‌పల్లి వెళ్లే దిశను కుడి వైపునకు చూపించాల్సి ఉండగా, ఎడమ వైపునకు చూపిస్తుండడంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. - **న్యూస్‌టుడే, ఇబ్రహీంపట్నం**

## నంది వాహన సేవ


ధర్మపురి పుర వీధుల్లో స్వామి వారి సేవ ఊరేగింపు

**ధర్మపురి, న్యూస్‌టుడే:** పట్టణంలో సోమవారం రాత్రి నంది వాహన సేవ. భక్తులను అలరించింది. శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా వేద పండితులు, అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. రాత్రి శ్రీ రామలింగేశ్వర స్వామి ఉత్సవ మూర్తులను నంది వాహనంపై ఆసీనులను చేసి మంగళ వాయిద్యాలు, భక్తుల వెంట రాగా పుర వీధుల్లో ఊరేగించారు.

## జాతీయ స్థాయి సాఫ్ట్ బేస్‌బాల్ పోటీలకు ఎంపిక


కోరుట్ల పబ్లిక్ స్కూల్ విద్యార్థులు

**కోరుట్ల, న్యూస్‌టుడే:** ఈ నెల 11 నుంచి 13 వరకు హర్యానాలోని ఫరీదాబాద్‌లో జరగనున్న జూనియర్ జాతీయ స్థాయి సాఫ్ట్ బేస్‌బాల్ ఛాంపియన్‌షిప్ పోటీలకు కోరుట్ల పట్టణంలోని కోరుట్ల పబ్లిక్ స్కూల్ విద్యార్థులు రిత్విక్, గితేష్, శశివర్ధన్, ధనుష్క, శరణ్య, మనోజ్ఞ ఎంపికైనట్లు కరస్పాండెంట్ గుజ్జేటి వెంకటేశ్ సోమవారం తెలిపారు. ఈనెల 7 నుంచి 9 వరకు మంచిర్యాల జిల్లా బెల్లంపల్లి తిలక్ స్టేడియంలో జరిగే శిక్షణ శిబిరానికి విద్యార్థులు తరలివెళ్లినట్లు చెప్పారు. పీఈటీ శంకర్, వనిత, ఉపాధ్యాయ బృందం అభినందించారు.

# రెండు నెలల్లో పనులు పూర్తి

**జగిత్యాల గ్రామీణం, న్యూస్‌టుడే:** రెండు నెలల్లో నూకపల్లి అర్బన్ కాలనీలో రెండు పడక గదుల ఇళ్లలో మౌలిక వసతులు కల్పిస్తామని ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్ అన్నారు. జగిత్యాల పట్టణ పేద ప్రజల కోసం నూకపల్లి వద్ద నిర్మించిన రెండు పడక గదుల ఇళ్లను సోమవారం అధికారులతో కలిసి పరిశీలించారు. పట్టణంలోని పేదల కోసం 4520 ఇళ్ల నిర్మాణం పూర్తి చేశామని, తాగునీటి పథకానికి అమృత్ కార్యక్రమంలో రూ. 36 కోట్లు మంజూరయ్యాని అన్నారు. ఇందిరమ్మ ఇళ్లలో ముళ్లపొదలు పెరిగి ఉండేందుకు ఇబ్బందిగా మారిందని వాటిని కూడా శుభ్రం చేయాలని మున్సిపల్ కమిషనర్‌ను ఆదేశించారు. రూ. 7 కోట్లతో నిర్మించిన 14 లక్షల లీటర్ల తాగునీటి ట్యాంకు నిర్మాణం పూర్తయిందన్నారు. విద్యుత్తు మీటరు రూ. 1700కే అందజేస్తారని ఆ తర్వాత 200 యూనిట్ల వరకు ఉచిత కరెంట్ అందనుందన్నారు. మున్సిపల్ కమిషనర్ సమ్మయ్య, వైస్ ఛైర్మన్ గోలి శ్రీనివాస్, లక్ష్మణ్, నాగబూషణం, కౌన్సిలర్ చాందుపాషా, ఏఈ రాజమల్లయ్య, శరణ్, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.


నూకపల్లి అర్బన్ కాలనీలో పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్

## ఎస్సారెస్పీకి కొనసాగుతున్న వరద

**జగిత్యాల ధరూర్‌క్యాంపు, న్యూస్‌టుడే:** శ్రీరామసాగర్ ప్రాజెక్టులోకి సోమవారం సాయంత్రం వరకు 21,590 క్యూసెక్కుల వరద వస్తుండగా వరదకాలువకు 12 వేల క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. కాకతీయ కాలువ, విద్యుత్ ఉత్పత్తికి 6,800, ఎస్కేప్ గేట్లద్వారా గోదావరిలోకి 1,200, లక్ష్మీ కాలువకు 150, సరస్వతి కాలువకు 500, మిషన్ భగీరథకు 231 క్యూసెక్కుల చొప్పున నీటిని విడుదల చేస్తున్నారు. ప్రాజెక్టులో గరిష్ఠస్థాయిలో 80.501 టీఎంసీల నీటినిల్వఉంది.

## డిజిటల్ కార్డుల సర్వే పూర్తి

**కోరుట్ల, న్యూస్‌టుడే:** కోరుట్ల పట్టణంలోని 18వ వార్డు, మండలంలోని సర్పరాజ్‌పల్లె గ్రామంలో ఈనెల 3 నుంచి డిజిటల్ కార్డుల కోసం అధికారులు చేపట్టిన సర్వే సోమవారంతో పూర్తయింది. పట్టణంలో 321 కుటుంబాలు, సర్పరాజ్‌పల్లెలో 150 కుటుంబ సభ్యుల పూర్తి వివరాలు సేకరించినట్లు తహసీల్దార్ కిషన్ తెలిపారు. ఎంపీడీవో రామకృష్ణ, మున్సిపల్ కమిషనర్ తిరుపతి, అధికారుల బృందం పాల్గొన్నారు.

## జ్వరాలపై అప్రమత్తంగా ఉండాలి

**కొడిమ్యాల, న్యూస్‌టుడే:** డెంగీ జ్వరాలపై మరింత అప్రమత్తంగా ఉండాలని జిల్లా ఉపవైద్యాధికారి శ్రీనివాస్ అన్నారు. కొడిమ్యాల మండలం పూడూర్ గ్రామంలోని ఆయుష్మాన్ ఆరోగ్య మందిరాన్ని సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పూడూర్ ఆయుష్మాన్ ఆరోగ్య కేంద్రం నేషనల్ క్వాలిటీస్ అస్యూరెన్స్ స్టాండర్డ్స్‌కి ఎంపికైనందున కేంద్రంలో జరుగుతున్న పనులను అడిగి తెలుసుకున్నారు. మండల వైద్యాధికారి పరమేశ్వరి, సీహెచ్‌వో రాజశేఖర్, పర్యావేక్షకురాలు వెంకటనర్సమ్మ, ఏఎన్ఎంలు, తదితరులు పాల్గొన్నారు.

## మద్యం సీసాలు ధ్వంసం

**మేడిపల్లి, న్యూస్‌టుడే:** అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల సమయంలో నమోదైన వివిధ అబ్కారీ కేసులకు సంబంధించిన 350 లీటర్ల మద్యాన్ని సోమవారం ధ్వంసం చేశారు. ధ్వంసమైన మద్యం విలువ రూ.1.70 లక్షలు ఉంటుందని పోలీసులు తెలిపారు. ఆబ్కారీ టాస్క్‌ఫోర్స్ సీఐ రాజమౌళి, మేడిపల్లి ఎస్సై శ్యాంరాజ్ తదితరులు పాల్గొన్నారు.

## మార్కెట్ కమిటీ పాలకవర్గ ప్రమాణ స్వీకారం


మల్యాల మార్కెట్ కమిటీ ఛైర్మన్ బత్తిని మల్లీశ్వరి, వైస్ ఛైర్మన్ కేతిరెడ్డి జీవన్‌రెడ్డి, సభ్యుల ప్రమాణ స్వీకారం

**మల్యాల, న్యూస్‌టుడే:** మల్యాల వ్యవసాయ మార్కెట్ కమిటీ ఛైర్మన్, వైస్ ఛైర్మన్‌తోపాటు 13 మంది సభ్యులతో కార్యదర్శి సోమవారం స్థానిక మార్కెట్ యార్డులో ప్రమాణ స్వీకారం చేశారు. ఛైర్మన్ బత్తిని మల్లీశ్వరి, వైస్ ఛైర్మన్ కేతిరెడ్డి జీవన్‌రెడ్డి, సభ్యులుగా బొల్లం పాపిరెడ్డి, కంబాల రాజమల్లు, రామిడి శేఖర్, బర్ల లింగయ్య, డబ్బు సత్యవతి, కనకట్ల జలందర్, యాల్ల స్వామిరెడ్డి, ముదాం మల్లేశం, ముప్పారపు విద్యాసాగర్, కొలకాని మారుతి, కొంజర్ల రవిందర్, గందె కోటేష్, రాజనర్సింగారావు ప్రమాణ స్వీకారం చేశారు. ఆనందరెడ్డి, ఆదిరెడ్డి, రాజేశ్వర్‌రెడ్డి, ఇమామ్, లక్ష్మీనారాయణ, డబ్బు లక్ష్మారెడ్డి, రాజిరెడ్డి, శంకర్‌గౌడ్, నారాయణగౌడ్, మహిపాల్‌రెడ్డి, మల్లికార్జున్‌రెడ్డి, కార్యకర్తలు పాల్గొన్నారు.

## స్కానింగ్ కేంద్రం సీజ్

**జగిత్యాల, న్యూస్‌టుడే:** జగిత్యాల జంబిగద్దె సమీపంలో జ్యోత్స్న ఆసుపత్రిలోని స్కానింగ్ కేంద్రాన్ని అధికారులు సీజ్ చేశారు. అనుమతి లేకుండా మూడు స్కానింగ్ యంత్రాలు కలిగి ఉన్నందుకు తనిఖీలు నిర్వహించిన జిల్లా అదనపు కలెక్టర్ పి.రాంబాబు, ఇన్‌ఛార్జి వైద్యాధికారి డాక్టర్ జైపాల్‌రెడ్డి కేంద్రానికి సీల్ వేశారు. అనుమతి లేకుండా స్కానింగ్ కేంద్రాలు నిర్వహించరాదని లింగనిర్ధారణ పరీక్షలు చేస్తే క్రిమినల్ చర్యలు తీసుకుంటామని ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ రాంబాబు హెచ్చరించారు.

# బతుకమ్మ వేడుకలు


జగిత్యాల భారాస కార్యాలయంలో బతుకమ్మ ఆడుతున్న మహిళలు

**మెట్‌పల్లి పట్టణం, న్యూస్‌టుడే:** పట్టణంలోని జ్ఞానోదయ డిగ్రీ కళాశాలలో బతుకమ్మ సంబరాలు ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు రంగురంగుల పూలతో బతుకమ్మలను తయారు చేశారు. అనంతరం అధ్యాపకులతో కలిసి విద్యార్థినులు బతుకమ్మ ఆడిపాడారు. కరస్పాండెంట్ ఇల్లెందుల శ్రీనివాస్, అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.


ధర్మపురిలో..

**మెట్‌పల్లి పట్టణం:** మెట్‌పల్లిలో ఆర్య వైశ్య సంఘం ఆధ్వర్యంలో సోమవారం బతుకమ్మ వేడుకలను ఘనంగా నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి జువ్వాడి నర్సింగరావు వేడుకల్లో పాల్గొని శుభాకాంక్షలు తెలిపారు. లింబాద్రి, రాంబాబు, జెట్టిలింగం, ఆకుల లింగారెడ్డి, జగన్, రాకేష్, రవి, సురేష్ కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

**జగిత్యాల:** భారాస ఆధ్వర్యంలో పార్టీ జిల్లా కార్యాలయంలో సోమవారం రాత్రి బతుకమ్మ వేడుకలు జరిగాయి. అధిక సంఖ్యలో మహిళలు పాల్గొని ఆడిపాడారు. జడ్పీ మాజీ ఛైర్‌పర్సన్ దావ వసంత, జిల్లా భారాస అధ్యక్షుడు కల్వకుంట్ల విద్యాసాగర్‌రావు సతీమణి సరోజన తదితరులు పాల్గొన్నారు.

**ధర్మపురి, న్యూస్‌టుడే:** పట్టణంలోని గోదావరి తీరాన సోమవారం రాత్రి బతుకమ్మ సంబరాలను ఘనంగా నిర్వహించారు. అనంతరం నదిలో నిమజ్జనం చేశారు. శారదా మహిళా మండలి అధ్యక్షురాలు మద్వాచారి విజయలక్ష్మి, సభ్యులు పాల్గొన్నారు.


మెట్‌పల్లి: జ్ఞానోదయ డిగ్రీ కళాశాలలో..


మెట్‌పల్లిలో ఆర్యవైశ్య మహిళలు



## వంతెనపై ప్రమాదకర గుంతలు

**కొడిమ్యాల, న్యూస్‌టుడే:** కొడిమ్యాల మండలం పూడూర్ గ్రామశివారులోని జగిత్యాల-కరీంనగర్ ప్రధాన రహదారిలో వంతెనపై గుంతలు పడటంతో ప్రమాదకరంగా మారింది. నిత్యం వేల సంఖ్యలో వాహనాలు ఈ రహదారి మీదుగా రాకపోకలు సాగిస్తుంటాయి. గుంతల కారణంగా వాహనాలు అదుపుతప్పి ప్రమాదాలు జరుగుతుండగా రాత్రి సమయంలో ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయి. గతంలో ఇదే వంతెనపై కరీంనగర్‌కు చెందిన ఓ పాల వ్యాన్ డ్రైవర్, నాచుపల్లి గ్రామానికి చెందిన మరో వ్యక్తి వేర్వేరు ప్రమాదాల్లో ప్రాణాలు కోల్పోయిన సంఘటనలు ఉన్నాయి. ఆర్ అండ్‌బీ అధికారులు ఇప్పటికైనా స్పందించి గుంతలకు మరమ్మతు చేయించి ప్రమాదాలు నివారించాలని ప్రయాణికులు కోరుతున్నారు.

## నాటుకోళ్ల పెంపకంతో ఆర్థికాభివృద్ధి

**మెట్‌పల్లి :** నాటుకోళ్ల పెంపకంతో మహిళలు ఆర్థికాభివృద్ధి సాధించేందుకు ప్రభుత్వం రుణాలు మంజూరు చేస్తోందని ఐకేపీ ఏపీఎం విమోచన పేర్కొన్నారు. మెట్‌పల్లి మండలం చింతలపేటలో నాటు కోళ్ల పెంపకానికి సంబంధించిన మదర్ యూనిట్‌ను సోమవారం ప్రారంభించారు. పెరట్లో నాటు కోళ్ల పెంచుకునే లబ్ధిదారులను కూడా ఎంపిక చేశామన్నారు. ఐకేపీ సిబ్బంది ఉన్నారు.

# పూర్వ విద్యార్థుల సమ్మేళనాలు


పెగడపల్లి: 1999-2000 పదో తరగతి బృందం


కోరుట్ల: అయిలాపూర్‌లో..

**కోరుట్ల, న్యూస్‌టుడే:** కోరుట్ల మండలం అయిలాపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2005-06లో పదో తరగతి పూర్తి చేసిన పూర్వవిద్యార్థులు సోమవారం ఆత్మీయ సమ్మేళనం ఏర్పాటు చేసుకున్నారు. ఉపాధ్యాయులను సన్మానించారు. అంజిరెడ్డి, లక్ష్మీనర్సయ్య, భూమాచారి, నాగేశ్వర్, చాంద్ ఖాన్, పూర్వవిద్యార్థులు పాల్గొన్నారు.

**పెగడపల్లి:** స్థానిక జడ్పీ ఉన్నత ఉన్నత పాఠశాలలో 1999-2000 విద్యాసంవత్సర పదో తరగతి పూర్వ విద్యార్థుల సమ్మేళనం సోమవారం జరిగింది. విద్యార్థులు తమకు విద్యాబోధన చేసిన గురువులను సన్మానించి జ్ఞాపకాలు గుర్తుచేసుకున్నారు.

**క్రైం కార్నర్**

## ఆటోను ఢీకొని వ్యక్తి దుర్మరణం

**మల్లాపూర్, న్యూస్‌టుడే:** ద్విచక్రవాహనంతో ఆగి ఉన్న ఆటోను ఢీకొట్టి వ్యక్తి దుర్మరణం చెందినట్లు మల్లాపూర్ ఎస్సై కిరణ్‌కుమార్ తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. నిర్మల్ జిల్లా ఖానాపూర్ మండలం ఎల్లాపూర్ గ్రామానికి చెందిన అడ్లూరి నర్సయ్య(40) తన ద్విచక్రవాహనంపై పాతదాంరాజుపల్లి గ్రామం నుంచి ఖానాపూర్ వైపు వెళ్తున్నాడు. గ్యాస్ సిలిండర్ల డెలివరీ కోసం సంగెంలో రహదారిపై నిలిపి ఉంచిన ఆటోను వెనుక నుంచి ఢీకొట్టడంతో నర్సయ్య అక్కడికక్కడే మృతిచెందారు. నిబంధనలు పాటించకుండా రహదారిపై ఆటోను నిలిపి ఉంచడం వల్లే ప్రమాదం జరిగినట్లు ఎస్సై తెలిపారు.

## విద్యుదాఘాతంతో రైతు మృత్యువాత

**పెగడపల్లి:** బతికపల్లికి చెందిన బొమ్మెళ్ల అంజయ్య (53) అనే రైతు సోమవారం తన వ్యవసాయ బావివద్ద విద్యుదాఘాతానికి గురై మృతి చెందినట్లు ఎస్సై రవికిరణ్ తెలిపారు. మధ్యాహ్నం పొలానికి నీరు పెట్టేందుకు వెళ్లిన అంజయ్య.. చీకటి పడుతున్నా ఇంటికి రాకపోయేసరికి బావివద్దకు వెళ్లగా విగతజీవుడై కనిపించాడు. మృతుని భార్య పదేళ్ల క్రితం అనారోగ్యంతో మృతిచెందింది. వారికి ఇంటర్ చదువుతున్న ఓ కూతురు ఉంది. మృతుని సోదరి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

## చోరీ కేసులో ఒకరికి జైలు శిక్ష

**ఆర్మూర్ పట్టణం :** దొంగతనం కేసులో ఓ నిందితుడికి సోమవారం ఆర్మూర్ ప్రథమ శ్రేణి న్యాయమూర్తి వేముల దీప్తి జైలు శిక్ష విధించారు. ఏర్గట్ల శివారులోని శివాలయంలో 2023 డిసెంబరులో జగిత్యాల జిల్లా మల్లాపూర్ మండలం హుస్సేన్ నగర్‌కు చెందిన షైక్ బాబు (25) చోరీకి పాల్పడ్డాడు. గుడి తాళాలు పగులగొట్టి ఇత్తడి గంటలు ఎత్తుకెళ్లాడు. ఎస్సై మచ్చేందర్ కేసు నమోదు చేసి, దర్యాప్తు చేశారు. ఛార్జిషీట్ దాఖలు చేయడంతో ఏపీపీవో రామకృష్ణ 8 మంది సాక్షులను కోర్టులో ప్రవేశపెట్టి నేరం రుజువు చేశారు. జడ్జి వేముల దీప్తి నేరస్థుడు షైక్ బాబుకు ఏడాది సాధారణ జైలు శిక్ష, రూ.1000 జరిమానా విధించారు.

## వరద కాలువలో మృతదేహం గుర్తింపు

**కోరుట్ల:** జగిత్యాల జిల్లా కథలాపూర్ మండల కేంద్రం శివారులోని వరద కాలువలో వృద్ధుడి మృతదేహాన్ని సోమవారం గుర్తించినట్లు పోలీసులు తెలిపారు. నిజామాబాద్ జిల్లా మోర్తాడ్ మండలం దొన్నల్‌కు చెందిన రామగిరి నర్సయ్య(70) మృతదేహంగా గుర్తించారు. ఈనెల 5న నర్సయ్య అదృశ్యమైనట్లు కుటుంబ సభ్యులు మోర్తాడ్ పోలీసులకు ఫిర్యాదు చేయగా వరదకాలువలో గుర్తించిన మృతదేహాన్ని బయటకు తీసి కుటుంబ సభ్యులకు అప్పగించినట్లు పోలీసులు పేర్కొన్నారు.

## చల్‌గల్‌లో చోరీ

**జగిత్యాల గ్రామీణం:** జగిత్యాల గ్రామీణ మండలం చల్‌గల్‌లో ఆదివారం రాత్రి చోరీ జరిగింది. గ్రామానికి చెందిన చింతలపల్లి సతీష్ ఇంట్లో దొంగలు తాళం పగులగొట్టి బీరువాలో దాచి ఉంచిన 10 తులాల బంగారం, రూ.45 వేల నగదును ఎత్తికెళ్లినట్లు బాధితుడు జగిత్యాల రూరల్ పోలీసులకు సోమవారం ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

## సారా విక్రేతల బైండోవర్

**ఇబ్రహీంపట్నం:** మండలంలోని వేములకుర్తి, ఎర్రాపూర్ తండాలో సారా విక్రయిస్తున్న ఇద్దరిని తహసీల్దార్ ప్రసాద్ ఎదుట సోమవారం బైండోవర్ చేసినట్లు ఎక్సైజ్ ఎస్సై లక్ష్మణ్ తెలిపారు. వేములకుర్తి గ్రామానికి చెందిన శ్రీనివాస్, ఎర్రాపూర్ తండాకు చెందిన భూక్య లక్ష్మీబాయి సారా విక్రయిస్తుండగా పట్టుకొని వారి నుంచి 8 లీటర్ల నాటు సారా స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. సిబ్బంది వహీద్, రాంచందర్ పాల్గొన్నారు.

**సంక్షిప్తం**

## కొనసాగుతున్న రిలేదీక్ష

**మల్లాపూర్, న్యూస్‌టుడే:** మల్లాపూర్ మండలం సిరిపూర్ సహకార సంఘం పరిధిలో సమస్యలను పరిష్కరించాలని కోరుతూ పాలక వర్గ సభ్యులు చేపట్టిన రిలేదీక్ష మూడో రోజుకు చేరింది. జగిత్యాల డీసీవో సహకార సంఘంలో చోటు చేసుకున్న సమస్యలను పరిష్కరించాలన్నారు. సొసైటీ ఛైర్మన్ అంజిరెడ్డి, డైరెక్టర్‌లు, రైతులు పాల్గొన్నారు.

## అధికారుల విచారణ

**మెట్‌పల్లి:** మెట్‌పల్లి మండలం వెల్లుల్ల ప్రహ్లాద సహిత లక్ష్మీనరసింహస్వామి ఆలయ ఆవరణలో సోమవారం అధికారులు విచారణ జరిపారు. గ్రామంలో దేవుడి ఊరేగింపు(శావ) విషయమై ఇరువర్గాలు అధికారుల దృష్టికి తీసుకుపోయిన సంగతి తెలిసిందే. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు తహసీల్దార్ శ్రీనివాస్ ఎస్సై రాజుతో కలిసి గ్రామానికి వెళ్లారు. ఇరువర్గాల వాదనలు విన్నారు. విషయాన్ని ఉన్నతాధికారులకు నివేదిస్తామని అధికారులు తెలిపారు. దేవుడి ఊరేగింపునకు పోలీసులు బందోబస్తు కల్పించారు.

## విజేత జట్టుకు ట్రోఫీ అందజేత

**కొడిమ్యాల:** కొడిమ్యాల మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల మైదానంలో మండల స్థాయి విలేజ్ టూ విలేజ్ నైట్ సర్కిల్ క్రికెట్ పోటీలు జీజీ బాయ్స్ ఆధ్వర్యంలో ఆదివారం సాయంత్రం ప్రారంభించగా అర్ధరాత్రి దాటిన తర్వాత ముగిశాయి. పోటీల్లో మండలం నుంచి 14 జట్లు పాల్గొనగా కొడిమ్యాల కృష్ణంరాజు 7, హిమ్మత్‌రావుపేట జట్లు ఫైనల్‌లో తలపడ్డాయి. కృష్ణంరాజు 7 జట్టు విజేతగా నిలవగా హిమ్మత్‌రావుపేట జట్టు రన్నర్స్‌గా నిలిచారు. విజేతలకు ట్రోఫీలను అందజేశారు. చొక్కాల నాగార్జున, బత్తిని సుమంత్, అర్షనపెల్లి శివ, గుడిపెల్లి మహర్షి, విలాసాగర్ మనోజ్, చొక్కాల నరేందర్, తదితరులు పాల్గొన్నారు.

## సంఘాలు-కార్యవర్గాలు

**కొడిమ్యాల:** కొడిమ్యాల మండలం పూడూర్ గ్రామంలోని శ్రీ నల్ల పోచమ్మ, బాల హనుమాన్ సేవాదళ్ నూతన కార్యవర్గ ఎన్నికను సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిటీ అధ్యక్షుడిగా వొల్లాల జగదీష్, ఉపాధ్యక్షుడిగా దాచిపల్లి మధురెడ్డి, కోశాధికారిగా దూలం పర్శరామ్, ఉపకోశాధికారిగా గుండ్ల అనిల్‌కుమార్, ప్రధాన కార్యదర్శిగా గడ్డమీది భరత్, కార్యదర్శులుగా ఎన్నుకున్నట్లు తెలిపారు.

## క్రికెట్ టోర్నీ ప్రారంభం

**రాయికల్:** మండలంలోని భూపతిపూర్ గ్రామంలో సోమవారం బి.పి.యల్ క్రికెట్ టోర్నీని మండల పంచాయతీ అధికారి సుష్మ ప్రారంభించారు. జక్కుల చంద్రశేఖర్, మహేశ్వర్‌రావు, గుర్రం మహేందర్‌గౌడ్, మంగళారపు లక్ష్మీనారాయణ, గుర్రం మల్లేశం, వ్యాయామ ఉపాధ్యాయులు ప్రతాప్, దేవేందర్, రవీష్, సత్యం తదితరులున్నారు.

## బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం

**ధరూర్(జగిత్యాల గ్రామీణం):** జగిత్యాల అర్బన్ మండలం ధరూర్ గ్రామానికి చెందిన పెండెం రవి ఇటీవల మృతి చెందగా బాధిత కుటుంబ సభ్యులకు 1987 పదో తరగతి స్నేహితులు సోమవారం రూ.10 వేలు అందజేశారు.

## పట్టభద్రులు దరఖాస్తు చేసుకోవాలి

**సారంగాపూర్:** ఎమ్మెల్సీ ఓటు హక్కు కోసం పట్టభద్రులు, ఉపాధ్యాయులు దరఖాస్తు చేసుకోవాలని తహసీల్దార్ జమీర్ కోరారు. రానున్న పట్టభద్రుల ఎన్నికల ఓటు హక్కు వినియోగం కోసం డిగ్రీ పూర్తి చేసిన వారు, ఉపాధ్యాయ రంగంలో పనిచేస్తున్న వారు ఓటర్లుగా నమోదు చేసుకోవాలని సూచించారు.

## ఉచిత కంటి వైద్య శిబిరం

**గొల్లపల్లి:** స్థానిక రేకుర్తి కంటి ఆసుపత్రి, లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో గొల్లపల్లిలో సోమవారం ఉచిత కంటి చికిత్స వైద్యశిబిరం నిర్వహించారు. 150 మందికి పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందించారు. 35 మందిని చికిత్స నిమిత్తం రేకుర్తి ఆసుపత్రికి తరలించారు. ఎస్సై సతీష్, రాజేందర్, కరుణాకర్‌రెడ్డి, నరహరి, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

# వేరుసెనగ సాగుకు వేళాయే..

రైతేరాజు



జె.విజయ్, శాస్త్రవేత్త, కృషి విజ్ఞాన కేంద్రం, జమ్మికుంట



వేరుసెనగ పంట

న్యూస్‌టుడే, జమ్మికుంట

వేరుసెనగ సాగులో రైతులు మొదటి నుంచే జాగ్రత్తలు పాటిస్తే మంచి ఫలితాలు ఉంటాయని జమ్మికుంట కృషి విజ్ఞాన కేంద్రం సేద్య విభాగం శాస్త్రవేత్త జె.విజయ్ తెలిపారు. ఉత్తర తెలంగాణలో అక్టోబర్ రెండో పక్షంలో విత్తుకోవచ్చని పేర్కొన్నారు. వేరుసెనగ సాగుకు సంబంధించి పాటించాల్సిన పలు అంశాలను ఆయన ఈ మేరకు వివరించారు.

**అనువైన నేలలు:** ఇసుకతో కూడిన గరక నేలలు లేదా త్వరితంగా నీరు ఇంకే ఎర్రనేలలు వేరుసెనగ సాగుకు అనువైనవి.

**విత్తనాల ఎంపిక, మోతాదు:** యాసంగిలో నీటివసతి ఉండే ప్రాంతాల్లో కదరి-6, కదరి-9, టీఏజీ-24, హరితాంధ్ర, ఐసీజీఎస్-91114, టీసీజీఎస్-1694 (విశిష్ట), ధరణి మేలైన రకాలు. గింజ బరువు, విత్తే సమయాన్ని బట్టి విత్తిన మోతాదు మారుతుంది. యాసంగిలో ఎకరానికి 60-80 కిలోల విత్తనం సరిపోతుంది.

**విత్తనశుద్ధి:** కిలో విత్తనానికి 1 గ్రాము టెబ్యుకొనజోల్ లేదా 3 గ్రాముల మాంకోజెబ్ పొడి మందు పట్టించాలి. కాండం కుళ్లు వైరస్ తెగుళ్లు వ్యాపించే ప్రాంతాల్లో 2 మి.లీ.ఇమిడ్లోప్రిడ్‌ను 7 మి.లీ. నీటిలో కలిపి కిలో విత్తనానికి పట్టించాలి.

**విత్తే దూరం:** సాళ్ల మధ్య దూరం 22.5 సెం.మీ., మొక్కల మధ్య 10 సెం.మీ. దూరం ఉండేలా విత్తుకోవాలి.

**ఎరువుల యాజమాన్యం:** ఎకరానికి 100 కిలోల సూపర్ ఫాస్పేట్, 33 కిలోల మ్యూరేట్ ఆఫ్ పొటాష్, 18 కిలోల యూరియాను విత్తే సమయంలో వేయాలి. విత్తిన 30 రోజుల తర్వాత తొలిపూత దశలో మరోసారి 10 నుంచి 15 కిలోల యూరియాను వేయాలి.

■ ఎకరానికి 200 కిలోల జిప్సమ్‌ను పూత పూర్తయ్యి ఊడలు దిగే సమయంలో మొదళ్ల దగ్గర వేసి మట్టిని ఎగదోయాలి. విత్తన 45 రోజుల తర్వాత ఎలాంటి అంతర సేద్యాన్ని చేపట్టవద్దు.

**కలుపు నివారణ:** కలుపు మొలకెత్తక ముందు పెండిమిథాలిన్ 30% ఇ.సి. ఎకరానికి 1.30 నుంచి 1.60 లీ. వంతున 200 లీటర్ల నీటికి కలిపి పిచికారీ చేయాలి. విత్తన 20 రోజుల వరకు కలుపు తీసేందుకు వీలుకాని పరిస్థితుల్లో కలుపు 2-3 ఆకుల దశలో ఉన్నప్పుడు ఇమాజితాపైర్ 10% మందు 300 మి.లీ.లను ఎకరానికి 200 లీటర్ల నీటితో కలిపి విత్తిన వెంటనే లేదా 20-30 రోజుల్లో పిచికారీ చేస్తే అన్ని రకాల కలుపును నివారించవచ్చు.

**నీటి యాజమాన్యం:** యాసంగిలో వేరుసెనగ సాగుకు తేలిక నేలలో 6 నుంచి 8 తడులు ఇవ్వాలి. పైరులో ఊడలు దిగే దశ నుంచి కాయలు ఊరే దాకా (విత్తిన 45-50 రోజుల నుంచి 85-90 రోజుల వరకు) నీరును తగిన మోతాదులో కట్టాలి.

**పంట కోతను గుర్తించటం:** వేరుసెనగలో 75 శాతం కాయలు పూర్తిగా పక్వానికి వచ్చినప్పుడే కోయాలి. కాయల్లోని భాగం ముదురు గోధుమ రంగులోకి మారినప్పుడు కోతకు వచ్చిందని గుర్తించాలి.

## దిగుబడులపై పోషకాల ప్రభావం

మీకు తెలుసా?

అన్నిరకాల పంటల్లోనూ అధిక వర్షం, బెట్ట, చలి, ఉష్ణోగ్రతల్లో హెచ్చుతగ్గులు, గాలిలో తేమ, నేలతీరును బట్టి పోషకలోపాలు తలెత్తి మొక్కల ఎదుగుదల దిగుబడులను, ఉత్పత్తుల నాణ్యతను ప్రభావితం చేస్తాయి. నత్రజని, భాస్వరాన్ని అధికంగా, పొటాష్‌ను పరిమితంగా వాడుతున్నారు. వీటితోపాటు ఉపపోషకాలైన మెగ్నీషియం, కాల్షియం, గంధకం, సూక్ష్మపోషకాలైన జింకు, కాపర్, ఐరన్, మాంగనీసు, బోరాన్, మాలిబ్డినం, క్లోరిన్ తదితరాలు పంటలకు అవసరం ఉంటాయి. పైర్లపై తలెత్తే ఈ పోషక లోపాలను సకాలంలో గుర్తించి సరిదిద్దాలి.

- న్యూస్‌టుడే, జగిత్యాల వ్యవసాయం

రైతు ప్రశ్న శాస్త్రవేత్త సమాధానం



రైతుల సందేహాలను పొలాస పరిశోధన స్థానం శాస్త్రవేత్త డాక్టర్ ఎన్.బలరాం నివృత్తి చేశారు.

**? వరిలో కంకినల్లిని ఎలా అరికట్టాలి - రాజమల్లయ్య, కండ్లపల్లి**

✓ డైకోఫాల్ 5.0 మి.లీ. లేదా స్పైరోమెసిఫెన్ 1.0 మి.లీ., ప్రొపికొనజోల్ 1.0 మి.లీ.మందును ఒక లీటరు నీటికి వంతున కలిపి అవసరం మేరకు వారం, పది రోజుల వ్యవధితో రెండు సార్లు పైరుపై పిచికారీ చేయాలి.

# భూమి తక్కువ.. లాభాలు ఎక్కువ



న్యూస్‌టుడే, సారంగాపూర్

ఉన్న కొద్దిపాటి భూమితో లాభాలు ఆర్జిస్తున్నారు సారంగాపూర్ మండలంలోని పోచంపేట రైతులు. ఎప్పుడు ఏదో కూరగాయ పంటను సాగు చేస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారు.



బెండ తోటలో రైతు నారాయణ

### విభిన్న పంటలు

గడప నారాయణకు రెండెకరాల భూమి ఉంది. ప్రస్తుతం 4 గుంటల్లో బెండ, అయిదు గుంటల్లో చిక్కుడు, నాలుగు గుంటల్లో మిరప సాగు చేపట్టారు. ఇప్పటికే బెండతో లాభాలు పొందుతున్నారు. విత్తనాలకు రూ.1,600, సేంద్రియ ఎరువుకు రూ.6 వేలు, ఇతరత్రా రూ.5 వేల పెట్టుబడి పెట్టారు. బెండకాయల విక్రయం ద్వారా రోజుకు రూ.300ల చొప్పున దాదాపు 90 రోజులు విక్రయించి రూ.25 వేలకు పైగా ఆదాయం పొందినట్లు తెలిపారు. త్వరలోనే చిక్కుడు దిగుబడి అందుబాటులోకి రానుందని.. దీని ద్వారా రోజు రూ.500ల చొప్పున కనీసం మూడు నెలల పాటు ఆదాయం రానుందని తెలిపారు. పంట చుట్టూ తీగజాతి అయిన సొరను సాగు చేశామని.. మరో 10 గుంటల్లో టమాట సాగుకు సిద్ధం చేసినట్లు నారాయణ వివరించారు.

### రూ.లక్ష ఆదాయం

గ్రామానికి చెందిన గడప సత్తన్న 10 గుంటల విస్తీర్ణంలో బెండ సాగు చేశారు. విత్తనాల కోసం రూ.2,500 వ్యయం చేయగా, ఇతర ఖర్చుల కింద రూ.2 వేలు పెట్టుబడి పెట్టారు. 45 రోజులకు బెండ కాతకు వచ్చింది. మూడు నెలల పాటు రోజుకు రూ.1,000 నుంచి రూ.1500ల వరకు ఆదాయం వచ్చినట్లు సత్తన్న పేర్కొన్నారు. మొక్కజొన్న సాగు చేసి అంతర పంటగా ఏడు గుంటల విస్తీర్ణంలో చిక్కుడు సాగు చేయగా ప్రస్తుతం కాత దశకు చేరుకుంది. తక్కువ విస్తీర్ణంలో ఏదోరకం కూరగాయల పంట సాగు చేపడితే రోజూ చేతిలో డబ్బులు ఉంటాయని ఈ రైతులు వెల్లడించారు.

# విదేశాలకు స్వదేశీ రుచులు!

**సులభంగా తినుబండారాలు, వస్తువుల బట్వాడా ■ విస్తరిస్తున్న కొరియర్ సంస్థలు**



విద్య, ఉద్యోగం, ఉపాధి, వ్యాపారం నిమిత్తం ఏటా ఉమ్మడి జిల్లా నుంచి విదేశాలకు వెళ్లే వారి సంఖ్య గణనీయంగా పెరుగుతోంది. ఇప్పటికే అమెరికా, ఆస్ట్రేలియా, ఇంగ్లాండ్‌లాంటి దేశాల్లో స్థిరపడిన ఇక్కడి కుటుంబాలు చాలానే ఉన్నాయి. ఈక్రమంలో ఇక్కడి తినుబండారాలు, పచ్చళ్లకు విదేశాల్లో గిరాకీ ఏర్పడింది. అక్కడి ఆహార పదార్థాలు నచ్చక, చేసుకోవడానికి సమయం లేక, ఆరోగ్యం తదితర కారణాలతో ఇక్కడి నుంచి బట్వాడా చేసుకొంటున్నారు. మందులు, వంట సామగ్రి, పప్పులనూ ఇక్కడి నుంచి ఇతర దేశాలకు పంపిస్తుండటంతో ఉమ్మడి కరీంనగర్ జిల్లా కేంద్రంలో కొరియర్ సంస్థలు పెరిగాయి.

– న్యూస్‌టుడే, తెలంగాణచౌక్ (కరీంనగర్)



### తినుబండారాలే అధికం..

అమెరికా, ఇంగ్లాండ్‌లాంటి దేశాల్లో భార్యాభర్తలు ఉద్యోగం చేస్తేనే కుటుంబ పోషణతో పాటు డబ్బు పొదుపు చేసుకోవడానికి వీలుంటుంది. విధులు నిర్వర్తించడం, ఖాళీ సమయం ఎక్కువ ఉండకపోవడంతో, ఆరోగ్యం, రుచులపరంగా ఇంటి నుంచి తెప్పించుకోవడానికి ఎక్కువగా ప్రాధాన్యమిస్తున్నారు. కుటుంబ సభ్యులు, బంధువులు, స్నేహితుల సాయంతో లేదా కొరియర్ ద్వారా తెప్పించుకుంటున్నారు. దీనికి అనుగుణంగా కొరియర్ సంస్థలు ఫెడెక్స్, యూపీఎస్, డీహెచ్‌ఎల్, ఇతర సంస్థలతో అవగాహన ఒప్పందం కుదుర్చుకొని పార్సిళ్లను పంపిస్తున్నాయి. ఎక్కువగా పచ్చళ్లు, మిఠాయిలు, పిండి పదార్థాలు, మందులు(మెడిసిన్స్) విదేశాలకు కొరియర్ చేస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

### రూ.కోట్లలో వ్యాపారం

కిలో పార్సిల్‌కు రూ.2800, 10 కిలోల పైన ఉంటే కిలోకు రూ.660-700 చొప్పున, మందులకు అయితే రూ.3400(500 గ్రాములు) తీసుకుంటున్నారు. విదేశాలకు కొరియర్లు పంపించే వ్యాపారం ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో ఏటా రూ.2 కోట్లపైగా జరుగుతుందని చెప్పారు. దసరా, సంక్రాంతి, పచ్చళ్ల సీజన్లలో గిరాకీ అధికంగా ఉంటుందన్నారు. కరీంనగర్‌లో విదేశాలకు పంపే ప్రధాన కొరియర్ సంస్థలు అయిదు ఉన్నాయి.

### సీజన్‌లో అధికంగా..

ఎక్కువగా అమెరికాకు పార్శిళ్లు వెళ్తుంటాయి. రోజువారీగా కొరియర్లు తక్కువగానే ఉన్నా సంక్రాంతి, దసరా పండుగలప్పుడు ఎక్కువగా



కొరియర్ సంస్థలో పార్సిళ్లను సీల్ చేస్తూ..

ఉంటాయి. వినియోగదారుడు పార్సిల్ బుక్ చేసుకున్న తర్వాత అతనికి లింక్ పంపిస్తాం. దాని ద్వారా పార్సిల్ ఎక్కడ ఉంది. డెలివరీ అయిందా? అనే వివరాలు తెలుసుకోవచ్చు. మేము 100కు పైగా దేశాలకు వస్తువులు పంపుతుంటాం.

– గడ్డం విలాస్‌రెడ్డి, కొరియర్ సంస్థ నిర్వాహకుడు

### వందకుపైగా దేశాలకు..

■ కరీంనగర్ నుంచి అమెరికా, ఇంగ్లాండ్, ఆస్ట్రేలియా, జర్మనీ, కెనడా, సింగపూర్, మలేషియా తదితర 100 దేశాలకు పార్సిళ్లను పంపించే వెసులుబాటును కొరియర్ సంస్థలు అందిస్తున్నాయి.

■ మందులు పంపితే వైద్యుడి ప్రిస్క్రిప్షన్, ఆధార్, చరవాణి నంబరు, స్వీకరించే వ్యక్తికి సంబంధించిన పాస్‌పోర్టు జిరాక్స్ ప్రతులు, చిరునామా తప్పనిసరిగా జత చేయాలి.

■ ప్రతి రోజు కరీంనగర్ నుంచి 15 నుంచి 20 వరకు, నెలకు దాదాపు 500కుపైగా.. పండుగల(సంక్రాంతి, దసరా) సీజన్లలో అయితే రోజుకు 200 నుంచి 300 వరకు, నెలకు 3 వేలకు పైగా విదేశాలకు పార్సిళ్లు వెళ్తుంటాయని నిర్వాహకులు తెలిపారు. జగిత్యాల, రాజన్న సిరిసిల్ల జిల్లాల నుంచి గల్ఫ్ వెళ్లే వారి సంఖ్య ఎక్కువగా ఉండటంతో వారు కరీంనగర్ వచ్చి కొరియర్ చేస్తారు.

■ పార్సిళ్లల్లో 80 శాతం అమెరికాకే బుక్ అవుతుండగా యూకే(10 శాతం), ఆస్ట్రేలియా, సింగపూర్, గల్ఫ్ తదితర దేశాలకు మరో పది శాతం వెళ్తున్నట్లు ఓ కొరియర్ నిర్వాహకుడు పేర్కొన్నారు.

■ సోమవారం పార్సిళ్లు బుకింగ్ చేస్తే.. ఆ దేశాలకు శుక్రవారం చేరే అవకాశముంది. శని, ఆదివారం సెలవు కావడంతో వాటిని తీసుకోవడానికి ఇంటి వద్ద ఉంటారనే ఉద్దేశంతో సోమవారం ఎక్కువ బుక్ చేస్తున్నారు.

■ బంగారం, వెండి, కొబ్బరి(కుడుకలు), కొబ్బరి పొడి, నూనెలు, బ్లేడ్లు, పిన్నీసులు, పిన్నులు, కరివేపాకు, మండే స్వభావం కలిగిన వస్తువులు కొరియర్ చేయడానికి వీల్లేదు.


# కారు కొనటానికి తండ్రి నిరాకరణ.. తనయుడి బలవన్మరణం



మహేందర్

**జమ్మికుంట, న్యూస్‌టుడే:** దళిత బంధు నిధులతో కొన్న ట్రాక్టర్ విక్రయించి కారు కొనాలని అడగ్గా తండ్రి నిరాకరించడంతో తనయుడు బలవన్మరణానికి పాల్పడిన ఘటన జమ్మికుంట మండలం పాపయ్యపల్లిలో జరిగింది. సీఐ రవి, గ్రామస్థుల కథనం మేరకు.. పాపయ్యపల్లికి చెందిన శనిగరపు భద్రయ్య గ్రామపంచాయతీ పారిశుద్ధ్య కార్మికుడిగా పనిచేస్తున్నాడు. దళిత బంధు పథకం యూనిట్ కింద ట్రాక్టర్ తీసుకున్నాడు. ట్రాక్టర్‌ను విక్రయించి కారు కొనాలని ఆదివారం భద్రయ్యను అతని కుమారుడు మహేందర్(22) అడగ్గా నిరాకరించాడు. దీంతో మహేందర్ పురుగు మందు తాగాడు. వెంటనే వరంగల్ ఎంజీఎం ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో రాత్రి మృతి చెందాడు. సోమవారం మృతుడి భద్రయ్య ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు సీఐ చెప్పారు.

# బతుకమ్మ పూలకు వెళ్లి.. బావిలో పడి మృత్యువాత



కాళిదాసు

**గన్నేరువరం, న్యూస్‌టుడే:** బతుకమ్మ పండగ సమీపిస్తున్న క్రమంలో పూల కోసం వెళ్లి ప్రమాదవశాత్తు వ్యవసాయ బావిలో పడి వ్యక్తి మృతి చెందిన సంఘటన గన్నేరువరం మండలం జంగపల్లిలో జరిగింది. పోలీసులు, బాధిత కుటుంబసభ్యుల కథనం మేరకు.. జంగపల్లికి చెందిన గుంటుక కాళిదాసు(40) ఆదివారం బతుకమ్మ పూల కోసమని బయటకు వెళ్లి ఇంటికి తిరిగి రాలేదు. సోమవారం ఉదయం కాళిదాసు మృతదేహం గ్రామంలోని ఓ వ్యవసాయ బావిలో తేలడంతో గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. వారు వచ్చి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కరీంనగర్ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని ఎస్సై నరేష్ దర్యాప్తు చేపట్టారు.



## పొదుపు సంఘాల్లో పేరుకుపోతున్న

# మొండి బకాయిలు

● అప్పులు చెల్లించని సంఘాలపై దృష్టి

● మనుగడలోకి తీసుకొచ్చేందుకు ప్రణాళిక

న్యూస్‌టుడే, పెద్దపల్లి కలెక్టరేట్:

స్వయం సహాయక సంఘాల్లో మొండి బకాయిలు పేరుకుపోతున్నాయి. అప్పులు చెల్లించడంలో కొందరు మహిళా సంఘాల సభ్యులు ఏళ్ల తరబడి ఉదాసీనంగా వ్యవహరిస్తున్నారు. దీంతో లావాదేవీలు నిలిచిపోవడంతో సంఘాల మనుగడ ప్రశ్నార్థకంగా మారుతోంది. ఈ క్రమంలో ఆర్థిక స్వావలంబనపై ప్రభావం చూపుతున్న బకాయిల వసూళ్లపై గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ ప్రత్యేక దృష్టి సారించింది. గ్రామాల వారీగా సంఘాల జాబితా రూపొందించి.. క్షేత్ర స్థాయిలో వాటికి గల కారణాలను అన్వేషిస్తున్నారు. సభ్యులను సంఘటితం చేసి కిస్తీలు చెల్లింపుతో పాటు పొదుపు బాట పట్టించేందుకు ప్రయత్నిస్తున్నారు.



ఎలిగేడు మండలం దూళికట్టలో మహిళలకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

**ఉమ్మడి జిల్లాలో మహిళ సంఘాల మొండి బకాయిల వివరాలు**

| | సంఘాలు | సొమ్ము(రూ.కోట్లలో) |
|---|---|---|
| పెద్దపల్లి | 460 | 12.95 |
| జగిత్యాల | 247 | 6.07 |
| కరీంనగర్ | 231 | 7.48 |
| రాజన్నసిరిసిల్ల | 93 | 2.96 |

### ప్రత్యేక ప్రణాళిక రూపొందించాం

**- రవీందర్ రాథోడ్, జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి, పెద్దపల్లి**

జిల్లాలో మొండి బకాయిల వసూళ్లపై ప్రణాళిక రూపొందించాం. సీసీల నుంచి డీపీఎంల వరకు మహిళలతో సమావేశమవుతున్నారు. వాస్తవ పరిస్థితులు తెలుసుకుంటున్నారు. మహిళ సంఘాలను పొదుపు మార్గంలోకి తీసుకోస్తాం.

### ఉమ్మడి జిల్లాలో రూ.29.46 కోట్లు

పొదుపు అర్హత బట్టీ ప్రతి సంఘానికి రూ.10 లక్షల వరకు రుణాలు బ్యాంకులు మంజూరు చేస్తున్నాయి. అయితే రుణాలు పొందిన కొందరు మహిళలు తిరిగి కిస్తీలు చెల్లించడం లేదు. వలస వెళ్లడం, మృతి చెందడం, నిర్ణీత 65 ఏళ్ల వయసు నిండటం తదితర కారణాలతో బకాయిలు పేరుకుపోతున్నాయి. మహిళల ఉపాధితో పాటు ఇతర అవసరాలకు తీసుకున్న రుణాల వడ్డీ, అసలు చెల్లించకపోవడంతో లావాదేవీలు నిలిచిపోతున్నాయి. గ్రామాఖ్య సంఘాల సహకారంతో అప్పులు చెల్లించని మహిళల్లో చైతన్యం కల్పిస్తున్నారు. కొన్ని చోట్ల వారు ముందు కొచ్చినప్పటికి మరికొన్ని చోట్ల ఆశించిన స్థాయిలో స్పందన లభించడం లేదు. ఒక సంఘంలో ఇద్దరు బకాయిదారులు ఉంటే వారి సొమ్ము తామెలా చెల్లిస్తామంటూ అధికారులను ప్రశ్నిస్తున్నారు. దీంతో సంఘాల మనుగడ కష్టంగా మారే ప్రమాదం ఉండటంతో అధికారులు సంఘంలోని సభ్యులందరినీ సమన్వయం చేస్తూ తిరిగి గాడిలో పెట్టే ప్రయత్నం చేస్తున్నారు. ఉమ్మడి జిల్లాలో 49,544 స్వశక్తి సంఘాల్లో 5,48,091 మంది సభ్యులు ఉన్నారు. 1,031 సంఘాల్లో రూ.29.46 కోట్ల మొండి బకాయిలు ఉన్నాయి.

# గుడి, బడిని సందర్శించిన సుప్రీంకోర్టు న్యాయమూర్తి



కోదండరామ ఆలయం వద్ద సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సంజయ్‌కుమార్ తదితరులు

**కోనరావుపేట, న్యూస్‌టుడే:** కోనరావుపేట మండలం మల్కపేటలో మాజీ మంత్రి చల్మెడ ఆనందరావు తన సొంత డబ్బులు రూ.6 కోట్లు పైగా వెచ్చించి నిర్మించిన పాఠశాల భవనాన్ని సోమవారం సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సంజయ్‌కుమార్ సందర్శించారు. విద్యార్థులకు కార్పొరేట్ విద్య అందించేందుకు వీలుగా నిర్మించడం అభినందనీయమన్నారు. అనంతరం కాళేశ్వరం ఎత్తిపోతలు ప్యాకేజీ-9 రిజర్వాయర్ కట్టను ఆనుకుని బొల్లి గుట్టపై నిర్మించిన శ్రీకోదండరామస్వామి ఆలయాన్ని సందర్శించారు. పాఠశాల, ఆలయ నిర్మాణాలకు సంబంధించిన వివరాలను మాజీ మంత్రి కుమారుడు మధుసూదన్‌రావును అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట న్యాయవాదులు రామారావు, శ్రీధర్‌రెడ్డి, గ్రామ నాయకుడు ఆరె మహేందర్ తదితరులు ఉన్నారు.

## డిగ్రీ ఇన్‌స్టంట్ పరీక్ష ఫలితాల విడుదల

**కరీంనగర్ కలెక్టరేట్ :** శాతవాహన విశ్వవిద్యాలయం పరిధిలో గత సెప్టెంబరులో నిర్వహించిన డిగ్రీ ఇన్‌స్టంట్ పరీక్ష ఫలితాలు విడుదల చేసినట్లు ఎస్‌యూ పరీక్షల నియంత్రణాధికారి డా.శ్రీరంగప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. ఫలితాలు వెబ్‌సైట్ www.satavahana.ac.in లో అందుబాటులో ఉంచినట్లు పేర్కొన్నారు.

# చదువుతున్నారా.. బడి మానేశారా?

**పాఠశాలల్లో తేలని విద్యార్థుల లెక్క**

జిల్లాల వారీగా విద్యార్థుల సంఖ్య

| జిల్లా | సంఖ్య |
|---|---|
| పెద్దపల్లి | 7,498 |
| కరీంనగర్ | 12,952 |
| జగిత్యాల | 5,285 |
| రాజన్న సిరిసిల్ల | 4,400 |



పెద్దపల్లిలో మధ్యాహ్న భోజనం తింటున్న విద్యార్థులు

న్యూస్‌టుడే, పెద్దపల్లి కలెక్టరేట్

ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య తేల్చలేక విద్యాశాఖ అధికారులు తలలు పట్టుకుంటున్నారు. ఈ ఏడాది ప్రవేశాల గడువు ముగిసినప్పటికి తుది జాబితా కొలిక్కిరాలేదు. పిల్లలు చదువుతున్నారా? బడి మానేశారా? అనే ప్రశ్నలకు పొంతన కుదరడం లేదు.

### ఎందుకింత నిర్లక్ష్యం

■ కేంద్ర ప్రభుత్వం ఒకటి నుంచి ఇంటర్మీడియట్ వరకు విద్యార్థుల సంఖ్య కోసం 2012-13లో యూడైస్ పోర్టల్ (ఏకీకృత జిల్లా విద్యా సమాచారం) తెచ్చింది. రెండేళ్ల కిందట దీన్ని యూడైస్ ప్లస్‌గా మార్చారు.

■ ఏటా విద్యార్థుల సమగ్ర వివరాలు పొందుపరుస్తున్నారు. ఉమ్మడి జిల్లాలో 30,135 మంది పిల్లల సమాచారం లేదు.

■ బడి ఈడు పిల్లలు చదువుతున్నారా? బడి బయట ఉన్నారనే విషయం తేల్చేందుకు యూడైస్ ప్లస్ నివేదిక తేల్చుతుంది. ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పనకు ఈ నివేదిక కొలమానం కానుంది.

■ ప్రవేశం పొందిన విద్యార్థి ఆధార్ అనుసంధానిస్తున్నారు. దీంతో ఒక విద్యార్థి పేరు రెండు చోట్ల ఉండే అవకాశం లేదు. ■ వివరాలు నమోదు చేయడంలో ప్రభుత్వ, ప్రైవేటు యాజమాన్యాలు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయి. పోర్టల్‌లో నమోదు కాని విద్యార్థుల వివరాలపై ఉన్నతాధికారులు ఆదేశించినప్పటికీ ఫలితం లేదు.

### బోగస్ లెక్కలేనా?

పాఠశాలల్లో చేరిన ప్రతి విద్యార్థికి శాశ్వత విద్యా సంఖ్య (పర్మనెంట్ ఎడ్యుకేషనల్ నంబర్) కేటాయించి పోర్టల్‌లో నమోదు చేస్తారు. ఒక పాఠశాల నుంచి మరో బడికి మారినా, టీసీ తీసుకుని వెళ్లినా యూడైస్‌లోని డ్రాప్ బాక్స్‌లో వేస్తారు. ఈ శాశ్వత సంఖ్య ఆధారంగా ప్రవేశం కల్పిస్తే ఎక్కడ చదువుతున్నారో తెలుస్తుంది. ఒక వేళ బోగస్ పిల్లల నమోదు చేసినా వేరే చోట చేరకపోయినా డ్రాప్‌బాక్స్‌లో సంఖ్య కనిపిస్తుంది. విద్యార్థుల వివరాలు లేనివారివే డ్రాప్‌బాక్స్‌లో ఉంటాయి. ఈ లెక్కన ఉమ్మడి జిల్లాలో 30,135 మంది పిల్లల సమాచారం తేలాల్సి ఉంది. వాస్తవంగా వీరంతా చదువుతున్నారా లేదో అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

### నెలల తరబడి హాజరు కాకున్నా..

బడుల్లో బోగస్ సంఖ్య తప్పించుకునేందుకు ఎత్తుగడ వేస్తున్నారు. కొందరికి ఆధార్ వేలిముద్రలు పడటంలేదని.. మరికొందరు ఉపాధి కోసం వలస వెళ్లి మళ్లీ ఇక్కడినే చదువుకుంటారని.. ఆధార్ నవీకరణలో సాంకేతిక సమస్యలు ఉన్నాయని.. ఇలా కుంటిసాకులు చెబుతున్నారు. కొన్ని చోట్ల నెలల తరబడి పిల్లలు హాజరు కాకున్నా వారి రిజిస్టర్‌లో నమోదవుతున్నాయి. పిల్లల సంఖ్య తగ్గితే అక్కడ నుంచి బదిలీ లేదా డిప్యుటేషన్‌పై పంపిస్తారని ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. విద్యాశాఖ అధికారులు దృష్టి సారిస్తే బోగస్ సంఖ్య తేలనుంది.

### ప్రత్యేక కార్యాచరణ

ప్రతి విద్యార్థిని పోర్టల్ నమోదు చేస్తున్నాం. జిల్లాలో డ్రాప్ బాక్స్‌లో ఉన్న వివరాలను తొలగించేందుకు కార్యాచరణ అమలు చేస్తున్నాం. తమ పరిధిలోని సంఖ్యను తేల్చాలని ప్రధానోపాధ్యాయులను ఆదేశిస్తున్నాం. నిర్లక్ష్యం చేసిన యాజమాన్యాలపై కఠినంగా వ్యవహరిస్తున్నాం.

- మాధవి, జిల్లా విద్యాధికారి